నవతెలంగాణ

1

ఆదిలాబాద్

సోమవారం | డిసెంబర్ 11, 2023 | www.navatelangana.com

దుప్పట్లు పంపిణీ

నవతెలంగాణ - పెంచికల్‌పేట్

మండలంలోని బొంబాయిగూడ గ్రామానికి చెందిన సామాజిక కార్యకర్త చపిడె ప్రకాష్ ఆయన తండ్రి చపిడె పెంటయ్య జ్ఞాపకార్థం గ్రామంలోని నిరుపేద కుటుంబాలకు చెందిన 50 మందికి ఆదివారం దుప్పట్లను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చలికాలంలో నిరుపేదలు ఇబ్బందులు పడకుండా ఉండడానికి ప్రతి సంవత్సరం దుప్పట్లను అందించడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో గ్రామస్తులు చౌదరి గుండయ్య, బాపురావు, గంగారాం, వెంకటేశ్, ఇస్తారి పాల్గొన్నారు.



నేటి ప్రజావాణికి అధికారులు హాజరు కావాలి

నవతెలంగాణ-తాండూర్

సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో నిలిపివేసిన ప్రజావాణి కార్యక్రమాన్ని సోమవారం ప్రారంభిస్తున్నామని ఎంపీడీవో ప్రవీణ్‌కుమార్ తెలిపారు. మండల స్థాయి అధికారులు సకాలంలో హాజరు కావాలని తెలిపారు. మండల ప్రజలు తమ సమస్యలను నేరుగా ఎంపీడీఓ కార్యాలయానికి వచ్చి వినతుల రూపంలో తెలియజేయాలని పేర్కొన్నారు. ప్రజావాణి కార్యక్రమానికి హాజరుకాని అధికారుల వివరాలను జిల్లా అధికారులకు చర్యల నిమిత్తం పంపిస్తామని తెలిపారు.

యథేచ్ఛగా జీరో దందా..!

- అనుమతి లేకుండా వెలిసిన దుకాణాలు
- మార్కెట్‌కు పత్తి రాకుండా అక్కడే కొనుగోళ్లు
- ఏటా మార్కెట్ ఆదాయానికి భారీగా గండి
- అధికారులకు తెలిసినా పట్టించుకోని వైనం

నవతెలంగాణ- ఆదిలాబాద్ ప్రాంతీయ ప్రతినిధి

ఆదిలాబాద్

జిల్లాలో పత్తి దందా దళారులకు అడ్డూఅదుపు లేకుండా పోతోంది. మార్కెట్ నుంచి ఎలాంటి అనుమతులు లేకుండా దుకాణాలు తెరిచి యథేచ్ఛగా కొనుగోళ్ల పర్వం సాగిస్తున్నారు. ప్రతి ఏటా ఇదే తంతు జరుగుతున్నా అధికారులు కన్నెత్తి చూడటం లేదనే విమర్శలు వస్తున్నాయి. అధికారుల నిర్లక్ష్యం, దళారుల ఇష్టారాజ్యం కారణంగా మార్కెట్‌కు ఫీజు రూపంలో రావాల్సిన ఆదాయాన్ని కోల్పోవాల్సి వస్తోంది. గతంలో ఒకటి, రెండు ప్రాంతాలకే పరిమితమైన ఈ అక్రమ దుకాణాలు క్రమంగా పట్టణం నలువైపులా విస్తరించాయి. ఎలాంటి లైసెన్సు లేకుండా అక్రమంగా పుట్టగొడుగుల్లా వెలుస్తున్నా అధికారులు నివారించడంలో విఫలమవుతున్నారు.మార్కెట్ అధికారులకు తెలిసే ఈ దుకాణాలు వెలుస్తున్నాయనే ఆరోపణలు వస్తున్నాయి. గతేడాది కొందరు వ్యాపారులకు నోటీసులు జారీ చేసిన అధికారులు ఎలాంటి చర్యలు లేకుండానే వదిలేశారనే విమర్శలున్నాయి. ఇలాంటి అక్రమాలకు అడ్డుకట్ట వేయాల్సిన అధికారులు వ్యాపారులకే వంత పాడుతున్నట్లు తెలుస్తోంది.

ఆదిలాబాద్ అంటేనే పత్తి వ్యాపారానికి పెట్టింది పేరు. ఇక్కడి మార్కెట్‌కు ఆసియా వ్యాప్తంగా మంచి పేరు ఉంది. ప్రతి ఏటా లక్షల క్వింటాళ్ల పత్తి కొనుగోళ్లు జరుగుతుంటాయి. పత్తి కొనుగోళ్లు ప్రారంభమయ్యాయంటే రాష్ట్రంలో అందరి చూపు ఈ మార్కెట్ వైపే ఉంటుంది. అలాంటి పేరుగాంచిన ఈ మార్కెట్‌కు గడ్డుకాలం వచ్చి పడుతోంది. కొందరు దళారులు పత్తిని మార్కెట్‌కు రాకుండా అక్కడే కొనుగోళ్లు చేస్తున్నట్లు తెలుస్తోంది. మార్కెట్ నుంచి ఎలాంటి లైసెన్సు లేకుండా పట్టణ శివారుతో పాటు మండల కేంద్రాల్లో కొనుగోలు కేంద్రాలను ఏర్పాటుచేశారు. కొందరు వ్యాపారులు నేరుగా గ్రామాలకు వెళ్లి పత్తిని కొనుగోలు చేస్తుండగా.. మరికొందరు దుకాణాల్లో కొనుగోలు చేస్తున్నారు. మంచి ధర ఉన్న సమయంతో ఈ వ్యాపారులు మార్కెట్‌లో విక్రయించి సొమ్ము చేసుకుంటారని తెలుస్తోంది. లేదు.



లేదంటే అధిక ధర ఉన్న ఇతర ప్రాంతాలకు తరలించి విక్రయిస్తుంటారు. పత్తితో ఏదేని పంట ఉత్పత్తులు కచ్చితంగా మార్కెట్‌లో విక్రయించాల్సి ఉంటుంది. కానీ కొన్నేండ్లుగా చాలా వరకు పండించిన పత్తి పంట మొత్తం మార్కెట్‌కు రావడం మార్కెట్‌కు వస్తే కొనుగోలు చేసిన పత్తికి మార్కెట్ ఫీజు వసూలు చేయాల్సి ఉంటుంది. రూ.వందకు రూపాయి, రూ.లక్ష కొనుగోళ్లకు రూ.వెయ్యి వరకు మార్కెట్ ఫీజు చెల్లించాల్సి ఉంటుంది. ఫలితంగా మార్కెట్‌కు ఆదాయం సమకూరేందుకు ఆస్కారం ఉంటుంది. కానీ ఆదిలాబాద్‌లో మాత్రం చాలా వరకు పత్తి పంట మార్కెట్‌కు రావడం లేదు. పట్టణ శివారుతో పాటు పల్లెల్లోనే విక్రయించబడుతుందని తెలుస్తోంది.

మార్కెట్ ఆదాయానికి గండి..!

పత్తి, ఇతర పంట ఉత్పత్తుల కొనుగోళ్ల ద్వారా మార్కెట్‌కు రావాల్సిన ఆదాయాన్ని ఒడిసిపట్టి రైతులకు సౌకర్యాలు కల్పించాల్సిన అధికారులు నిర్లక్ష్యం ప్రదర్శిస్తున్నారు. రైతులు పత్తిని ఎక్కడైనా అమ్ముకోవచ్చనే కారణంగా అధికారులు ఈ సమస్యను పరిగణనలోకి తీసుకోవడం లేదని తెలుస్తోంది. కానీ ఎవరైనా మార్కెట్‌లో కాకుండా ఇతర చోట కొనుగోలు చేయాలంటే లైసెన్సు తీసుకోవాల్సి ఉంటుంది. కానీ ఎక్కడా అలాంటి పరిస్థితి కనిపించడం లేదు. లైసెన్సులు, మార్కెట్ అనుమతులు లేకుండానే యథేచ్ఛగా దుకాణాలు తెరిచి కొనుగోళు చేస్తున్నారు. ఫలితంగా మార్కెట్‌కు రావాల్సిన రూ.లక్షల ఆదాయాన్ని కోల్పోవాల్సి వస్తోందనే వాదన వినిపిస్తోంది. రైతులు పత్తిని మార్కెట్‌కు తీసుకురావాలంటే నిబంధనలు ఉంటాయనే రైతులను మభ్యపెడుతూ చాలా వరకు గ్రామాల్లోనే కొనుగోలు చేస్తున్నట్లు తెలుస్తోంది. ముఖ్యంగా పట్టణ శివారులో పదుల సంఖ్యలో దుకాణాలు వెలిసినా అధికారులు వాటివైపు కన్నెత్తి చూడటం లేదనే విమర్శలున్నాయి. నోటీసులతో సరిపెడుతూ దళారులకు వంత పాడుతున్నట్లు ఆరోపణలు వస్తున్నాయి. ఇప్పటికైనా అధికారులు వీటిపై దృష్టిసారించి మార్కెట్ ఆదాయానికి గండిపడకుండా చూడాలని రైతులు కోరుతున్నారు.

నోటీసులు జారీ చేస్తాం : శ్రీనివాస్, మార్కెట్ ఏడీ

అనుమతులు లేకుండా దుకాణాలు తెరిచి పత్తి కొనుగోళ్లచేస్తే చర్యలు తీసుకుంటాం. ఈ విషయం మా దృష్టికి వచ్చింది. వారికి నోటీసులు జారీ చేసి చర్యలు చేపడుతాం.


మహాలక్ష్మి, రాజీవ్ ఆరోగ్యశ్రీ పథకాలను ప్రారంభించిన ఎమ్మెల్యే



నవతెలంగాణ-బోథ్

మండల కేంద్రంలోని బస్టాండ్‌లో ఆదివారం ఎమ్మెల్యే అనిల్ జాదవ్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన రాజీవ్ ఆరోగ్య శ్రీ, మహిళకు ఆర్టీసీ బస్సులలో ఉచిత ప్రయాణ పథకాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రభుత్వ ఆస్పత్రిలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ రాజీవ్ ఆరోగ్య శ్రీ పథకం క్రింద పేద ప్రజలకు రూ. 10 లక్షల వరకు వైద్య సదుపాయం పొందవచ్చని తెలిపారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ప్రజలకు ఇచ్చిన హామీలను త్వరగా అమలు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ తుల శ్రీనివాస్, డీఎంహెచ్ఓ నరేందర్ రాథోడ్, ఆస్పత్రి సూపరింటెండెంట్ డా.రవీంద్ర ప్రసాద్, ఏఎంసీ ఛైర్మెన్ రుక్మాన్ సింగ్, నేరడిగొండ ఎంపీపీ సజన్, మండల కన్వీనర్ నారాయణ్ రెడ్డి, సర్పంచుల సంఘం అధ్యక్షుడు శ్రీధర్ రెడ్డి, స్థానిక సర్పంచ్ సురేందర్ యాదవ్, కో ఆప్షన్ మెంబర్ తాహిర్, మాజీ మండల కన్వీనర్ సదానందం, తలమడుగు మండల కన్వీనర్ తోట వెంకటేష్, ఆత్మ ఛైర్మెన్ మల్లెపూల సుభాష్ పాల్గొన్నారు.

ఎమ్మెల్యే పరామర్శ



నవతెలంగాణ-కౌటాల

మండల కేంద్రానికి చెందిన మాజీ ఎంపీటీసీ భద్రం బహూజీ అనారోగ్యంతో ఉన్న విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే డాక్టర్ పాల్వాయి హరీష్‌బాబు ఆయన నివాసానికి వెళ్లి పరామర్శించి ధైర్యం చెప్పారు. అనంతరం మెడికల్ రిపోర్టు చూసి సరైన క్రమంలో మందులు వాడితే వ్యాధి నయమవుతుందని ఆయనకి సూచించారు. ఆయన వెంట బీజేపీ నాయకులు ఎలుములె మల్లయ్య, మిథున్ కవిరాజ్ ఉన్నారు.

ఖానాపూర్ ఎమ్మెల్యేను కలిసిన వాఘాపూర్ గ్రామస్తులు



నవతెలంగాణ-ఆదిలాబాద్‌రూరల్

ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జును మండలంలోని వాఘాపూర్ గ్రామస్తులు మర్యాద పూర్వకంగా కలిశారు. ఆదివారం ఆదిలాబాద్ పట్టణంలోని ఓ హోటల్‌లో ఆయన్ను కలిసి పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం శాలువతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ కమిటీ కార్యనిర్వాహక అధ్యక్షుడు భూపెల్లి శ్రీధర్, సెడ్మాకి ఆనంద్ రావ్, అశోక్, గోస్కురి రాజేందర్, వాఘాపూర్ గ్రామ ఆదివాసీ యువకులు ఆత్రం శంకర్, తొడసం గణేష్, నైతం శ్రీనివాస్, చాకటి వంశీ, ఆత్రం దత్తు, చాకటి గంగారాం పాల్గొన్నారు.

ఎమ్మెల్యే మహేశ్వర్‌రెడ్డిని కలిసిన టీఎన్‌జీఓ నాయకులు



నవతెలంగాణ-నిర్మల్

నూతనంగా ఎన్నికైన నిర్మల్ ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్ రెడ్డి టీఎన్‌జీవో నాయకులు మర్యాద పూర్వకంగా కలిశారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని ఆయన నివాసంలో టీఎన్‌జీఓ జిల్లా కార్యవర్గం కలిసి శాలువతో సత్కరించారు. ఉద్యోగుల సమస్యలపై ప్రతిపక్ష పార్టీ నేతగా ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్తానని ఈ సందర్భంగా ఎమ్మెల్యే మహేశ్వర్ రెడ్డి అన్నారు. కార్యక్రమంలో టీఎన్‌జీఓ జిల్లా అధ్యక్షులు వెల్మ ప్రభాకర్, సంఘ సభ్యులు పాల్గొన్నారు.

రాజాసింగ్‌ను కలిసిన బీజేవైఎం నాయకులు

ఆదిలాబాద్‌టౌన్ : గోషామహల్ నియోజకవర్గ బీజేపీ ఎమ్మెల్యే రాజాసింగ్‌ను ఆదిలాబాద్ బీజేవైఎం నాయకులు కలిశారు. ఆదివారం హైదరాబాద్‌లోని ఆయన నివాసంలో ఆదిలాబాద్ భారతీయ జనతా యువమోర్చా నాయకులు మర్యాదపూర్వకంగా కలిసి మూడుసార్లు ఎమ్మెల్యేగా ఎన్నికైన రాజాసింగ్‌ను శాలువాతో సత్కరించి అభినందనలు తెలిపారు. అనంతరం కాసేపు రాజకీయ అంశాలపై మాట్లాడారు. ఈ కార్యక్రమంలో బీజేవైఎం నాయకులు మద్నే సురేందర్, ఆత్రం సాయి, గేడం శివ, వేముల శ్రీనివాస్, కిరణ్, శ్రీకాంత్, సురేష్ పాల్గొన్నారు.

ప్రత్యామ్నాయానికి సీఐటీయూను గెలిపించాలి



నవతెలంగాణ-రామకృష్ణాపూర్

సింగరేణిలో ప్రత్యామ్నాయానికి సీఐటీయూను గెలిపించాలని సింగరేణి కాలరీస్ ఎంప్లాయిస్ యూనియన్(సీఐటీయూ) డిప్యూటీ జనరల్ సెక్రెటరీ నాగరాజు గోపాల్ కోరారు. ఆదివారం పట్టణంలోని స్థానిక సిఐటియు కార్యాలయంలో యూనియన్ ముఖ్య కార్యకర్తలతో ఎన్నికలపై సమావేశం నిర్వహించారు. అనంతరం నాగరాజు గోపాల్ మాట్లాడుతూ గత కొన్ని సంవత్సరాలుగా సింగరేణి కార్మికులకు సొంతింటి కల కోసం సింగరేణి వ్యాప్తంగా పోరు యాత్ర మొదలుపెట్టి కార్మికుల్లో అవగాహన తీసుకొచ్చామన్నారు. 2011 నుండి అలవెన్స్‌లపై, ఐటి మాఫీపై పోరాటం చేస్తున్నామని అన్నారు. బిఆర్ఎస్ కోల్‌బెల్ట్ ఎమ్మెల్యేలకు ఈ అంశాలపై వినతి పత్రాలు ఇచ్చినా ఏనాడు అసెంబ్లీలో స్పందించలేదని తెలిపారు. గతంలో గెలిచిన యూనియన్లు స్ట్రక్చర్ సమావేశాలు నిర్వహించకుండా పైరవీలకే పరిమితమయ్యాయని తెలిపారు. సిఐటియుగా ఈ అంశాలపై పోరాడుతోందని పేర్కొన్నారు. ప్రభుత్వ అనుబంధ సంఘాలు ఉంటే కార్మిక సమస్యలపై యాజమాన్యాన్ని ప్రశ్నించరని టిబిజికెఎస్‌తో తెలిసి వచ్చిందని, చివరకు కార్మికులకు శుభ్రమైన నీళ్ల కూడా ఇప్పించలేని స్థితి ఉన్నదని మండిపడ్డారు. కార్మికులకు ఇంటి కిరాయి ఇవ్వకుండా ఉన్న రెండు సంఘాల తీరును ప్రశ్నిస్తూ యాజమాన్యంపై ఒత్తిడి తెచ్చి ఇప్పిస్తున్నామని తెలిపారు. ఈసారి జరగబోయే గుర్తింపు సంఘం ఎన్నికల్లో సీఐటీయూ సంఘాన్ని గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో బ్రాంచ్ అధ్యక్షులు ఎస్.వెంకట్‌స్వామి, కార్యదర్శి అల్లి రాజేందర్, ఉపాధ్యక్షులు ఐలయ్య, సంజీవ్, వివిధ గనుల ఫిట్ సెక్రటరీలు, కార్యకర్తలు పాల్గొన్నారు.

సింగరేణి భవిష్యత్తుకు ఏఐటీయూసీని గెలిపించుకోవాలి



నవతెలంగాణ - కాసిపేట

మండలంలోని సోమగూడెం కమ్యూనిటీ హాల్‌లో ఏఐటీయూసీ కాసిపేట గని ముఖ్య కార్యకర్తల సమావేశం ఆదివారం నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్యఅతిథులుగా సెంట్రల్ వైస్ ప్రెసిడెంట్ మిట్టపల్లి వెంకటస్వామి, బ్రాంచ్ ఇన్‌చార్జి చిప్ప నర్సయ్య, బ్రాంచ్ కార్యదర్శి మల్లేష్, బ్రాంచ్ ఉపాధ్యక్షులు బియ్యాల వెంకటస్వామి, కోశాధికారి నాగేశ్వర్‌రావు కార్మికులను ఉద్దేశించి మాట్లాడారు. డిసెంబర్ 27న జరిగే సింగరేణి గుర్తింపు సంఘం ఎన్నికలలో నిరంతరం కార్మికుల హక్కుల రక్షణ, సింగరేణి సంస్థ పరిరక్షణ కోసం పోరాటం చేసే ఏఐటీయూసీ యూనియన్‌ను భారీ మెజారిటీతో గెలిపించాలని కోరారు. మొన్నటి వరకు సర్కార్ సంఘమైన టీబీజీకేఎస్ మాయమాటలు నమ్మి సింగరేణిలో గుర్తింపు సంఘంగా గెలిపిస్తే, గెలిచిన సర్కార్, సంఘం కేవలం పైరవీలకు మాత్రమే పరిమితమైందన్నారు. ఏనాడు కార్మికుల సమస్యల గురించి పట్టించుకోలేదని, అంతే కాకుండా గత సర్కార్ సంఘం విధానాల వల్ల సింగరేణిలో రాజకీయ జోక్యం పెరిగి సంస్థ భవిష్యత్తు ప్రశ్నర్థకంగా మారిందన్నారు. కార్మికులు కష్టపడి సంపాదించిన సొమ్మును సింగరేణి సంస్థకు సంబంధం లేని జిల్లాలకు ఖర్చు పెట్టి, ఇప్పుడు కార్మికులకు జీతాలు ఇవ్వడానికి బ్యాంక్‌ల నుండి అప్పు తేవాల్సిన పరిస్థితి ఏర్పడిందన్నారు. గత సర్కార్ సంఘం గుర్తింపు సంఘంగా ఉంటే ఇలాంటి ఇబ్బందులే మళ్లీ వస్తాయన్నారు. కాంగ్రెస్ అనుబంధ సంఘం ఐఎన్టీయూసీ కూడా అదే బాటలో నడిచి సింగరేణి సంస్థని మరింత నష్టం చేసి సంస్థను దివాళా తీయాలని చూస్తోందన్నారు. ఈ విషయాలు కార్మికులు జాగ్రత్తగా గమనించాలని సూచించారు. నిన్న మొన్నటి వరకు కార్మికుల సమస్యలు ఏమాత్రం పట్టించుకోని కొన్ని మామూలు సంఘాలు ఇప్పుడు మీ ఓట్ల కోసం గనులు, డిపార్ట్మెంట్‌ల మీదకి వస్తున్నాయని పేర్కొన్నారు. ఆయా సంఘాల నాయకుల మాయమాటలు నమ్మి మరోసారి మోసపోవద్దని తెలిపారు. ఎల్లప్పుడూ వెన్నంటే ఉంటూ సమస్యలు పరిష్కరించి సంస్థను కాపాడుతున్న ఏఐటీయూసీని భారీ మెజారిటీతో గెలిపించుకోవాలని కోరారు. కార్మికులందరూ చుక్క గుర్తుకు ఓటు వేసి సింగరేణి సంస్థని కాపాడుకుందామని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ నాయకులు మీనుగు లక్ష్మీనారాయణ, కార్యకర్తలు, కార్మికులు పాల్గొన్నారు.

కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్, స్కీం వర్కర్ల పెండింగ్ వేతనాలు చెల్లించాలి



నవతెలంగాణ-నస్పూర్

కాంట్రాక్ట్ అవుట్ సోర్సింగ్, స్కీం వర్కర్ల పెండింగ్ వేతనాలు వెంటనే చెల్లించాలని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి దుంపల రంజిత్ కుమార్ అన్నారు. ఆదివారం సీఐటీయూ అనుబంధ రంగాల సమావేశం శ్రీరాంపూర్ పట్టణంలోని సీఐటీయూ కార్యాలయంలో రాజలింగు అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా రంజిత్ కుమార్ మాట్లాడుతూ కొత్తగా ఏర్పడిన కాంగ్రెస్ ప్రభుత్వానికి అభినందనలు తెలియజేస్తూ మేనిఫెస్టోలో పెట్టిన కార్మికుల సమస్యలను పరిష్కరించాలని కోరారు. పెండింగ్‌లో ఉన్న ఐదు జీవోలను గెజిట్ చేసి అమలు చేయాలని పేర్కొన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా ప్రభుత్వ కార్యాలయాల్లో పనిచేస్తున్న కాంట్రాక్ట్, అవుట్‌సోర్సింగ్ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించి, వారిని వెంటనే రెగ్యులర్ చేయాలన్నారు. పెండింగ్‌లో ఉన్న వేతనాలు వెంటనే చెల్లించాలని, డిసెంబర్ 27న జరిగే సింగరేణి గుర్తింపు ఎన్నికల్లో కార్మికుల సమస్యలపై అనునిత్యం పోరాడే సీఐటీయూను గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. ఈ సమావేశంలో సీఐటీయూ నాయకులు దూలం శ్రీనివాస్, కుంటాల కుమార్, దాగం రాజారాం, నర్సింహ, శోభ, శ్రీవిద్య పాల్గొన్నారు.

కాగడా గుర్తుకు ఓటేసి బీఎంఎస్‌ను గెలిపించాలి



నవతెలంగాణ-నస్పూర్

డిసెంబర్ 27న జరిగే సింగరేణి గుర్తింపు ఎన్నికల్లో కాగడా గుర్తుకు ఓటు వేసి సింగరేణి కోల్ మైన్స్ కార్మిక సంఘ్(బీఎంఎస్)ను గెలిపించాలని జాతీయ బొగ్గు పరిశ్రమల ఇన్‌చార్జి, జేబీసీసీఐ మెంబర్ కొత్తకాపు లక్ష్మారెడ్డి కార్మికులను కోరారు. ఆదివారం నస్పూర్‌లోని ఫంక్షన్ హాల్‌లో నిర్వహించిన బీఎంఎస్ మీటింగ్‌లో మాట్లాడారు. టీబీజీకేఎస్ నాయకులు కార్మికుల హక్కులపై కనీస అవగాహన లేకుండా మాట్లాడుతున్నారని తెలిపారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిందని, ఐఎన్టీయూసీకి ఓటు వేసి గెలిపిస్తే కేంద్రంతో మాట్లాడే అధికారం ఉండదని తెలిపారు. బిఎంఎస్‌ను గుర్తింపు సంఘంగా గెలిపిస్తే సింగరేణిలో సీఎండీ చేసిన అవకతవకలను బయటపెడుతూ, కార్మికులకు ఎలాంటి నష్టం వాటిల్లకుండా చూస్తామని పేర్కొన్నారు. బిఎంఎస్ కార్మికులకు అనేక హక్కులను సాధించి పెట్టిందని తెలిపారు. కాంట్రాక్ట్ కార్మికులకు కూడా కోల్ ఇండియాలో అమలు చేసినట్లు హై పవర్ కమిటీ వేతనాలు చెల్లించేలా చూస్తామని, కాంట్రాక్ట్ కార్మికుల కుటుంబ సభ్యులకు కూడా వైద్య అందేలా చూస్తామని వివరించారు. ఈ సందర్భంగా పలువురు యువ నాయకులు లక్ష్మారెడ్డి ఆధ్వర్యంలో బిఎంఎస్‌లో చేరారు. ఈ కార్యక్రమంలో బిఎంఎస్ అధ్యక్షుడు యాదగిరి, సత్తయ్య, ఏబికేఎంఎస్ కార్యదర్శి మండా రమాకాంత్, కార్యదర్శి పులి రాజారెడ్డి, ఎస్సీఎంకేఎస్ సెంట్రల్ సెక్రటరీ కాశెట్టి నాగేశ్వరరావు, శ్రీరాంపూర్ ఏరియా కార్యదర్శి నాతాడి శ్రీధర్‌రెడ్డి, జీడి ప్రభాకర్, అల్లంకి వసంతరావు, మేకల స్వామి, శ్రీకాంత్, రేణుగుంట్ల రాజశేఖర్, మురళి, భూంపల్లి రమేష్ పాల్గొన్నారు.

ప్రభుత్వానికి, ప్రజలకు వారధిగా ఉంటూ సమస్యల పరిష్కారానికి కృషి



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

తమ పార్టీ అధికారంలోకి రాకపోయినా ప్రభుత్వానికి, ప్రజలకు వారధిగా ఉంటూ సమస్యల పరిష్కారం కోసం శక్తి వంచన లేకుండా కృషి చేస్తానని ఎమ్మెల్యే పాయల్ శంకర్ అన్నారు. ఆర్యవైశ్య కిరాణా మర్చంట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో స్థానిక జిన్నింగ్ మిల్లులోని ఇస్కాన్ ఆలయ పరిసరాల్లో నిర్వహించిన కార్తీక వనభోజనానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. వాసవి మాతకు ప్రత్యేక పూజలు చేసిన అనంతరం నిర్వాహకులు ఎమ్మెల్యేను సత్కరించి అభినందనలు తెలియజేశారు. పెద్ద ఎత్తున తరలివచ్చిన కులస్తులు వనభోజనంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే పాయల్ శంకర్ మాట్లాడుతూ ఆదిలాబాద్ ప్రజల సంకల్ప బలం వల్లే తాను ఎమ్మెల్యేగా విజయం సాధించానని, తన గెలుపులో ప్రజలు అందించిన సహకారం మరువలేనిదని పేర్కొన్నారు. తనకు పదవి వ్యామోహం లేదని, శాసనసభ్యుడనే భావనతో దూరపు వ్యక్తిగా భావించవద్దని కోరారు. గతంలో ఎలాగైతే మీ వెంట ఉన్నానో ఇప్పుడూ ఎప్పుడూ అలాగే ఉంటానన్నారు. తన సాయం కోరి వచ్చిన ప్రతి ఒక్కరికి ఎళ్లవేళలా అందుబాటులోనే ఉంటానన్నారు. కులస్తులంతా ఐకమత్యంతో ఇలాంటి వేడుకలు జరుపుపోవడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు రాజేశ్వర్ కొత్తావార్, మర్చంట్ అసోసియేషన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు సంజయ్ బాశెట్టివార్, ఉల్లాస్ దెబ్బడివార్, రాజు, హరీష్, ప్రసాద్, నర్సిములు గాదెవార్, సుభాష్ చింతల్వార్, పడిగెలవార్ సంతోష్ పాల్గొన్నారు.

నిజాయితీ చాటిన ఆర్టీసీ డ్రైవర్

నవతెలంగాణ-నిర్మల్



ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణికుడు మరిచిపోయిన బ్యాగును బాదితుడికి అందించి నిజాయితీని నిరూపించుకున్నారు ఓ ఆర్టీసీ డ్రైవర్. నిర్మల్ డిపోకు చెందిన బస్సులో శనివారం అర్ధరాత్రి హైదరాబాద్‌కు అభినవ్ రెడ్డి ఎక్కి ప్రయాణం చేశారు. హైదరాబాద్‌లోని జెబిఎస్‌లో అభినవ్ రెడ్డి తన బ్యాగ్‌ను మరిచిపోయి దిగిపోయాడు. బస్సు ఎంజీబీఎస్‌కు చేరుకుంది. బ్యాగ్‌ను గమనించి డ్రైవర్ షాకిర్ అలీ సీటు నంబర్ ఆధారంగా సెల్‌పోన్ నంబర్ ద్వారా ప్రయాణికున్ని పిలిచారు. హైదరాబాద్ స్టేషన్ మేనేజర్ సమక్షంలో బ్యాగ్‌ను అందించారు. బ్యాగులో రూ. 5 లక్షలు, ఒక ఐ ఫోన్ ఉంది. నిజాయితీగా బ్యాగ్ అప్పగించిన నిర్మల్ డిపో డ్రైవర్ షాకిర్ అలీని అధికారులు ప్రయాణికులు అభినందించారు.

విద్యార్థులకు అవగాహన కార్యక్రమం

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్



మానవ హక్కుల దినోత్సవాన్ని పురస్కరించుకొని సఖీ, మహిళ సాధికారత కేంద్రం సంయుక్త ఆధ్వర్యంలో పట్టణంలోని ఎస్టీ పీఎంహెచ్ బాలికల హాస్టల్‌లో ఆదివారం పలు అంశాలపై విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మహిళా సాధికారత కేంద్రం సమన్వయ కర్త యశోద, సఖీ కేంద్రం సిబ్బంది లావణ్య పాల్గొని మాట్లాడుతూ మహిళలు అన్ని రంగాల్లో రాణించాలని సూచించారు. సైబర్ క్రైమ్ పట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో సిబ్బంది, విద్యార్థులు ఉన్నారు.

సూపర్ స్పెషాలిటీలో మెరుగైన వైద్య సేవలు అందేలా కృషి

- ఆదిలాబాద్ ఎమ్మెల్యే పాయల శంకర్



జెండా ఊపి ఉచిత బస్సు ప్రయాణాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే పాయల శంకర్

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

రిమ్స్ సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రిలో రోగులకు మెరుగైన వైద్య సేవలు అందేలా కృషి చేస్తానని ఆదిలాబాద్ ఎమ్మెల్యే పాయల్ శంకర్ అన్నారు. ఆదివారం రిమ్స్ సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి ప్రాంగణంలో ఆరోగ్య శ్రీ పరిమితిని రూ. 10 లక్షలకు పెంపు, మహాలక్ష్మి పథకం ద్వారా ఆర్టీసీ బస్‌లో మహిళలకు ఉచిత ప్రయాణ పథకాలను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ ఆరోగ్య శ్రీ పథకం రూ. 5 లక్షల నుండి రూ.10 లక్షలకు పెంచడం ద్వారా పేద, మధ్య తరగతి కుటుంబాలకు ఎంతో మేలు జరుగుతుందన్నారు. ఏ అనారోగ్య సమస్యకైనా హైదరాబాద్, నాగ్‌పూర్ ఆస్పత్రులకు నాణ్యమైన వైద్యం కోసం వెళ్లడం జరుగుతుందని, జిల్లాలోనే మెరుగైన వైద్యం అందేలా తన వంతు కృషి చేస్తానని అన్నారు. ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఆరోగ్య శ్రీ, మహాలక్ష్మి పథకాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఆర్టీసీ పల్లె వెలుగు, ఎక్స్‌ప్రెస్ బస్‌లలో రాష్ట్ర సరిహద్దు వరకు ఎక్కడికైనా ఉచితంగా ప్రయాణం చేయవచ్చని తెలిపారు. ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఉచిత ప్రయాణం, రూ. 10 లక్షల పెంపుకు సంబంధించిన పోస్టర్‌లను అధికారులతో కలిసి ఆవిష్కరించారు. అనంతరం బస్సు ప్రయాణాన్ని జెండా ఊపి ప్రారంభించి, ఉచిత టికెట్‌లను మహిళల ప్రయాణీయకులకు అందజేశారు. అనంతరం మహిళలతో ఎమ్మెల్యే, అధికారులు ప్రయాణించారు. ఈ కార్యక్రమంలో రిమ్స్ డైరెక్టర్ రాథోడ్ జై సింగ్, జిల్లా వైద్యఆరోగ్య శాఖ అధికారి డా. రాథోడ్ నరేందర్, ఆర్టీసీ ఆర్.ఎం సోలోమాన్, డీఎం కల్పన, మున్సిపల్ కమిషనర్ శైలజ, అధికారులు, ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

నర్సింహ స్వామిని దర్శించుకున్న డీఎస్పీ

నవతెలంగాణ-దిలావర్‌పూర్



మండలంలోని కాల్వ శ్రీ లక్ష్మీ నరసింహ స్వామి ఆలయాన్ని ఆదివారం నిర్మల్ డీఎస్పీ గంగారెడ్డి దర్శించుకున్నారు. ఆలయ కమిటీ చైర్మెన్ వుజారం మహేష్ డీఎస్పీని స్వాగతించి శాలువాతో సన్మానించారు. ఆలయ అర్చకులు వెంకటేష్ ప్రత్యేక పూజలు నిర్వహించి తీర్థ ప్రసాదాలు అందించారు. జిల్లాలోనే అతి ప్రాచీన, ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన కాల్వ శ్రీ లక్ష్మీ నరసింహ స్వామిని దర్శించుకోవడం పూర్వ జన్మ సుకృతంగా భావిస్తున్నాని ఈ సందర్భంగా డీఎస్పీ అన్నారు. అనంతరం ఆలయ పరిసర ప్రాంతాలు పరిశీలించారు. ఆయన వెంట నిర్మల్ మున్సిపల్ కోప్షన్ మెంబెర్ అశోక్ ఉన్నారు.

కాంగ్రెస్ ప్రభుత్వం

సభ విధానాలు, సంప్రదాయాలను ఉల్లంఘించింది

- నిర్మల్‌లో అక్రమ డీ-1 పట్టాలు
- ప్రభుత్వ భూముల కబ్జాలు బయటకు తీస్తాం : ఎమ్మెల్యే మహేశ్వర్‌రెడ్డి



విలేకరులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్‌రెడ్డి

నవతెలంగాణ-నిర్మల్

కాంగ్రెస్ ప్రభుత్వం సభ విధానాలు, సంప్రదాయాలను ఉల్లంఘించి సీనియర్ సభ్యులను కాదని అక్బరుద్దీన్‌ను ప్రొటెం స్పీకర్‌గా నియమించడం సరికాదని ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్ రెడ్డి అన్నారు. జిల్లా కేంద్రంలోని ఆయన నివాసంలో ఆదివారం విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం రాజకీయ లబ్ధి, మజ్లీస్ పార్టీ మెప్పు కోసం, కొన్ని వర్గాల ప్రజలను ఆకర్షించేందుకే ప్రభుత్వం ఈ నిర్ణయాన్ని తీసుకుందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రభుత్వం సభ సంప్రదాయాలను ఉల్లంఘించడం వల్లనే బీజేపీ తరపున ఎమ్మెల్యేలుగా గెలిచిన సభ్యులు అసెంబ్లీలో ప్రమాణస్వీకారం చేయలేదన్నారు. బీజేపీ ఏ వర్గానికి వ్యతిరేకం కాదని స్పష్టం చేశారు. గతంలో ఎంఐఎం, బీజేపీ దోస్తులని కాంగ్రెస్ పార్టీ తప్పుడు ప్రచారం చేసిందని, ప్రస్తుతం ఆ పార్టీ నిజాస్వరూపం బయటపడిందన్నారు. కాంగ్రెస్, బీఆర్ఎస్, ఎంఐఎం పార్టీలు ఒకే రక్తమని, మూడు పార్టీలు ఒకే నావపై ప్రయాణం చేస్తున్నాయని ఆరోపించారు. హిందూ మతాన్ని, ధర్మాన్ని కించపరిచిన అక్బరుద్దీన్ ఓవైసీ ప్రొటెం స్పీకర్ నియమించడాన్ని సహచర సభ్యుడు రాజాసింగ్ వ్యతిరేకించాడని కానీ ఆయన చేసిన వ్యాఖ్యాలు తప్పు పట్టడం సరికాదని పేర్కొన్నారు. రాజ్యాంగబద్ధంగా ప్రొటెం స్పీకర్ నియమించడంపై వ్యతిరేకించి అసెంబ్లీ ఎదుట నిరసన తెలిపామని, ఇదే విషయాన్ని గవర్నర్ దృష్టికి తీసుకెళ్లి ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. ఈనెల 14న స్పీకర్‌గా నియమితులైన దళిత బిడ్డ ప్రసాద్ సమక్షంలో ఎనిమిది మంది ఎమ్మెల్యేలు ప్రమాణ స్వీకారం చేస్తారని తెలిపారు. ప్రజల విశ్వాసాన్ని నమ్మకాన్ని ఎట్టి పరిస్థితుల్లో వమ్ము చేయకుండా అభివృద్ధి సంక్షేమం కోసం కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ ప్రాంతంలో ఎన్నో సమస్యలు ఉన్నాయని సమస్యల పరిష్కారానికి దశలవారీగా చర్యలు తీసుకుంటామన్నారు. రాష్ట్రంలో బీజేపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఉంటే డబుల్ ఇంజన్ సర్కార్‌తో ఊహించని అభివృద్ధి జరిగేదన్నారు. రాబోయే రోజుల్లో దేశ ప్రధాని మోడీ నాయకత్వంలో బీజేపీ ఆశయాలకు అనుగుణంగా డబుల్ ఇంజన్ సర్కార్ కోసం కృషి చేస్తామన్నారు. నిర్మల్‌లో ప్రభుత్వ భూములను అక్రమించుకొని డీ-1 పట్టాలు చేసిన జాబితా సిద్ధంగా ఉందని, ఒక్కొక్కటి బయటకు తీస్తామని తెలిపారు. పేద భూములను కబ్జా చేసిన వారిని విడిచి పెట్టేది లేదని, దీనిపై కమిషన్ వేసి నిజానిజాలను బయటకు తీస్తామన్నారు. భూ అక్రమలపై అసెంబ్లీలో గళమెత్తుతామన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలను నమ్మించి మోసపూరిత మేనిఫెస్టోను రూపొందించి అధికారంలోకి వచ్చిందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం సంక్షేమ కార్యక్రమాలు అమలు చేస్తే హర్షిస్తామని, లేనట్లయితే ప్రభుత్వంపై పోరాటం చేస్తామని స్పష్టం చేశారు. ఈ సమావేశంలో నాయకులు రావుల రామ్‌నాథ్, మెడిసెమ్మ రాజు, చందు, ముత్యం రెడ్డి, అర్జున్, జమాల్, వెంకటేష్, రాచకొండ సాగర్, శంకర్ పతి, కొండాజీ శ్రవణ్ పాల్గొన్నారు.

జనవరి 1న భీమా కోరెగావ్ శౌర్య దివాస్



మాట్లాడుతున్న బౌద్ధమహాసభ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ప్రజ్ఞాకుమార్

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

జనవరి ఒకటో తేదిన భీమా కోరేగావ్ శౌర్య దినం సందర్భంగా విజయస్థుపానికి మానవ వందన కార్యక్రమాన్ని నిర్వహించడం జరుగుతుందని భారతీయ బౌద్ధమహాసభ ఉత్తర తెలంగాణ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రత్నఝడే ప్రజ్ఞాకుమార్ అన్నారు. భుక్తాపూర్‌లోని బుద్ధ విహార్ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. వందన కార్యక్రమం మహాప్రజ్ఞ బుద్ధ విహార్ అభివృద్ధి కమిటీ, భారతీయ బౌద్ధమహా సభ, షెడ్యూల్డ్ కులాల హక్కుల పరిరక్షణ సంస్థ, రమాబాయి అంబేద్కర్ మహిళా సంఘం, సంఘమిత్ర వెల్ఫేర్ సొసైటీ, మాల యువసేన ఆధ్వర్యంలో జరుగుతుందన్నారు. దీనికి ప్రజాప్రతినిధులు, ప్రభుత్వ అధికారులు వివిధ సంఘాల నాయకులు సభ్యులు హాజరు కావటానికి ఏర్పాట్లు చేయాలని సూచించారు. అలాగే పట్టణంలో భారీ ర్యాలీ నిర్వహించేలా ప్రణాళిలతో పాటు తీర్మాణం చేశామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మహాప్రజ్ఞ బుద్ధ విహార్ అభివృద్ధి కమిటీ అధ్యక్షులు రత్నజాడే ఉదయ్ కుమార్, షెడ్యూల్డ్ కులాల హక్కుల పరిరక్షణ సంస్థ జిల్లా యూత్ అధ్యక్షులు రాజు మస్కే, రమాబాయి అంబేడ్కర్ మహిళా మండల్ అధ్యక్షురాలు తాడే పూజ, సంఘమిత్ర వెల్ఫేర్ సొసైటీ అధ్యక్షులు రాజు పటాడే, మాల యువసేన పట్టణ అధ్యక్షులు జాడే సిద్ధార్థ్, తాడే రాహుల్, సుకదేవ్ సురేష్, తాయిడే రవి, మంగళ బాయి, దీపాబాయ్, చంద్రకళ, లక్ష్మీబాయి పాల్గొన్నారు.

'రాష్ట్రంలో పదేండ్లు కాంగ్రెస్ అధికారంలో ఉంటుంది'



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

రాష్ట్రంలో పదేండ్లు కాంగ్రెస్ పార్టీనే అధికారంలో ఉండబోతోందని, రేవంత్ రెడ్డి ముఖ్యమంత్రిగా కొనసాగుతారని ఆదిలాబాద్ అసెంబ్లీ నియోజకవర్గ ఇన్‌చార్జి కంది శ్రీనివాస్ రెడ్డి జోస్యం చెప్పారు. పట్టణంలోని సంజయ్ నగర్ లో నల్వాల సుమ ఆధ్వర్యంలో ఆదివారం జరిగిన చేరికల కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. 14వ వార్డు నుండి కాలనీ వాసులు కంది సమక్షంలో కాంగ్రెస్‌లో చేరగా వారరికీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. తాను ఓడినా ప్రజల మధ్యనే ఉంటానని తనకు ఓటేసిన అందరికి ధన్యవాదాలు తెలిపారు. ఈ పదేండ్లు కాంగ్రెస్ పార్టీనే అధికారంలో ఉండబోతోందని, ఎన్నికలు ఏవైనా కాంగ్రెస్‌కే ఓటేయాలని ప్రజలను కోరారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు బాలూరి గోవర్ధన్ రెడ్డి, భూపెల్లి శ్రీధర్, షెడ్మాకి ఆనంద్‌రావు, ముడుపు దామోదర్ రెడ్డి, రషీద్ ఉల్ హాక్, ఉయిక ఇందిర, మునిగెల నర్సింగ్, నాగర్కర్ శంకర్, కొండూరి రవి, మానే శంకర్, రాజా లింగన్న, సురేష్, కాలనీవాసులున్నారు.

నేటి నుండి ప్రజావాణి

నవతెలంగాణ-నిర్మల్

ప్రతి సోమవారం నిర్వహించే ప్రజా ఫిర్యాదుల విభాగం సోమవారం నుండి కొనసాగుతుందని జిల్లా కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ ఆదివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయ సమావేశ మందిరంలో నిర్వహిస్తున్న ప్రజావాణి కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. రాష్ట్ర శాసనసభ ఎన్నికల ప్రక్రియ ముగిసినందున ప్రజావాణి కార్యక్రమం తిరిగి యధావిధిగా కొనసాగుతుందని వెల్లడించారు.

ఆరోగ్యశ్రీ పథకంతో నాణ్యమైన వైద్యం



నవతెలంగాణ-నిర్మల్

రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన రాజీవ్ ఆరోగ్య శ్రీ పథకం ద్వారా నిరుపేదలకు ఉచితంగా నాణ్యమైన కార్పొరేట్ వైద్యం అందుతుందని మున్సిపల్ చైర్మెన్ గండ్రత్ ఈశ్వర్ అన్నారు. జిల్లా కేంద్రంలోని ప్రధాన ప్రభుత్వ ఆస్పత్రిలో రాజీవ్ ఆరోగ్యశ్రీ ద్వారా రూ .10 లక్షల చేయూత పథకాన్ని ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా సంబంధిత పోస్టర్లను విడుదల చేసి మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం అందించే ఈ సేవలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో సారంగాపూర్ జెడ్పీటీసీ పత్తిరెడ్డి రాజేశ్వర్ రెడ్డి, సూపరింటెండెంట్ డా.సునీల్, డా.ధన్‌రాజ్, శ్రీనివాస్, కమిషనర్ సీవీఎన్ రాజు, స్థానిక కౌన్సిలర్ ముజ్జు చౌష్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

మహాలక్ష్మి పథకం ప్రారంభం...

జిల్లా కేంద్రంలోని ఆర్టీసీ బస్ స్టాండ్‌లో ఆదివారం మహాలక్ష్మి పథకాన్ని మున్సిపల్ చైర్మెన్ గండ్రత్ ఈశ్వర్ ప్రారంభించారు. బస్సులో మహిళలతో కలిసి ప్రయాణించారు. మహాలక్ష్మి పథకం ద్వారా తెలంగాణ రాష్ట్రంలో మహిళలు ఎక్కడి నుండి ఎక్కడికైనా పల్లె వెలుగు, సిటీ ఆర్డినరి, సిటీ మెట్రోలో ఉచితంగా ప్రయాణించవచ్చని తెలిపారు. అనంతరం సంబంధిత పోస్టర్లను విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో సారంగాపూర్ జెడ్పీటీసీ పత్తి రెడ్డి రాజేశ్వర్ రెడ్డి, డిపో మేనేజర్ ప్రతిమారెడ్డి, మున్సిపల్ కమిషనర్ సీవీఎన్ రాజు, స్థానిక కౌన్సిలర్ ముజ్జు చౌస్, శివ భూపతి, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

కంది పంట దిగుబడిపై రైతుల ఆశలు ఆవిరి



నవతెలంగాణ-తాంసి

అంతర పంటగా సాగవుతున్న కంది పంటకు ఆకాల వర్షాలు, వాతావరణం మార్పు కారణంగా ముప్పు తలెత్తుతోంది. జిల్లాతో పాటు తాంసి, భీంపూర్ మండలాల్లో ప్రధానంగా సాగయ్యే పత్తి, సోయా పంటల్లో రైతులు కందిని అంతర పంటగా సాగు చేస్తారు. ఖరీఫ్‌లో వేసిన కంది పూతకాతతో కళకళలాడి కనబడింది. పంటకు కీలకమైన దశలో తుఫాను రావడంతో అన్నదాతలను కలవరానికి గురిచేసింది. ప్రతికూల వాతావరణ పరిస్థితులతో ఇప్పటికే పత్తి దిగుబడులు తగ్గిపోయాయి. కందితోనైనా దిగుబడి కలిసి వస్తుందని గంపడంత ఆశతో ఉన్న సమయంలో అన్నదాతకు అకాల వర్షాలు కంటిమీద కొనుక్కు లేకుండా చేసి కంది పంటకు అపార నష్టాన్ని మిగిలించాయి. గత వారం పది రోజుల కింద అకాల వర్షాలు కురియడం, పొగ మంచు ఉండడంతో కంది పంటకు ఉన్న పూత పూర్తిగా నేల రాలిపోయింది. ఈ మధ్య కురిసిన అకాల వర్షాలతో కంది కర్రలన్నీ వంగిపోయాయి. వాతావరణం చల్లగా ఉంటే చీడపీడలు పురుగు ఉధృతి అధికంగా ఉంటుంది. కొంతమేర ఖాతా బాగుంది. ఇక దిగుబడి కలసి వస్తాయన్న భావనతో ఉన్నామని. ఈ తరుణంలో మళ్ళీ తుఫాను ప్రభావం ఎలాంటి పరిణామాలకు దారితీస్తుందో దారి తీస్తుందోనని, మొగులు పట్టేసి ఉండటంతో పరుగు ఉధృతి పెరుగుతుందని, కాయలు తినేస్తున్నాయని రైతులు అంటున్నారు. వర్షాలతో పత్తి నేల పాలవుతోంది. కూలీల కొరతతో సకాలంలో పంటలను ఇంటికి చేర్చలేక పోతున్నామని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



కాయలో పురుగు ఉధృతి

- ఎల్మ గంగా రెడ్డి, రైతు తాంసి.



పత్తి పంటలో అంతర పంటగా కంది పంటను వేశాను. పంట పూతకాత ఆశాజనకంగా ఉండగా తుఫాను, ఆకాల వర్షం కారణంగా పొగ మంచుతో పూత పూర్తిగా నేల రాలిపోయింది.

కాయలో పురుగు ఉధృతి అధికంగా ఉండండం, కంది పంటకు పూర్తిగా నష్టం వాటిల్లుతోంది. ఏమి చేయాలో అర్థం కావడం లేదు.

రేపు ఉమ్మడి జిల్లా హాకీ ఎంపిక పోటీలు

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

జిల్లా పాఠశాల క్రీడా సమాఖ్య ఆధ్వర్యంలో 12న జిల్లా కేంద్రంలోని ఇందిరా ప్రియదర్శిని స్టేడియంలో ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా జోనల్ స్థాయి బాలబాలికల హాకీ ఎంపిక పోటీలు నిర్వహిస్తున్నట్టు ఎస్జీఎఫ్ ఆర్గనైజింగ్ కార్యదర్శి కాంతారావు ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అండర్-14 బాలికలు, అండర్-17 బాలబాలికల విభాగంలో ఎంపిక పోటీలుంటాయన్నారు. అర్హులైన ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని బాలబాలికలు ఈ పోటీలకు హాజరుకావాలని సూచించారు. ఎంపిక పోటీలకు హాజరయ్యే క్రీడాకారులు అన్ని ధృవీకరణ పత్రాలతో ఉదయం 10 గంటలకు కన్వీనర్ కమలాకర్ రెడ్డి, పోటీల ఆర్గనైజర్ జాదవ్ రవీందర్‌కు స్టేడియంలో రిపోర్ట్ చేయాలన్నారు.

నేటి ప్రజావాణి యథాతథం

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

శాసనసభ ఎన్నికల కారణంగా గత రెండు నెలలుగా నిలిపివేసిన ప్రజావాణి కార్యక్రమాన్ని సోమవారం నుండి తిరిగి కొనసాగిస్తున్నట్టు ఆదిలాబాద్ కలెక్టర్ రాహుల్ రాజ్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. జిల్లా ప్రజలు వారి సమస్యల పరిష్కారం నిమిత్తం ఫిర్యాదులు సమర్పించేందుకు ఈనెల 11న యధావిధిగా కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించే ప్రజావాణి కార్యక్రమానికి హాజరై సమర్పించుకోవచ్చని తెలిపారు. ప్రజావాణి కార్యక్రమాన్ని జిల్లా ప్రజలందరూ సద్వినియోగం చేసుకోవాల్సిందిగా కలెక్టర్ పేర్కొన్నారు.

రిమ్స్ కార్మికుల సమస్యల పరిష్కారానికి కృషి



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

రిమ్స్ కాంట్రాక్ట్ కార్మికుల సమస్యల పరిష్కారానికి తనవంతుగా కృషి చేస్తానని ఆదిలాబాద్ అసెంబ్లీ నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జి కంది శ్రీనివాస్ రెడ్డి అన్నారు. ఆదివారం ప్రజా సేవ భవన్‌లో రిమ్స్ ఆస్పత్రి ఔట్ సోర్సింగ్ కార్మిక సంఘం అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు అక్రమ్ ఖాన్, దేవిదాస్ ఆద్వర్యంలో ఆయనను కలిసి తమ సమస్యలను విన్నవించారు. తమ కిచ్చే అరకొర వేతనాల్లో కాంట్రాక్టర్ కోత పెడుతున్నారని ఒక్కో కార్మికుని జీతం నుండి రూ. 3వేల వరకు అక్రమంగా కట్ చేస్తున్నారని చెప్పారు. పేషంట్ కేర్ టేకర్స్‌గా తీసుకొని ఇతర విధులు అప్ప చెబుతూ పని భారం మోపుతున్నారని, కార్మికుల పట్ల ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారని ఆయన దృష్టికి తీసుకొచ్చారు. ప్రభుత్వ దృష్టికి తమ సమస్యలు చేర్చి తమకు న్యాయం చేయాలని కోరగా ఆయన సానుకూలంగా స్పందించారు. అనంతరం శాలువా, పుష్ప గుచ్చంతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు బాలూరి గోవర్ధన్ రెడ్డి, భూపెల్లి శ్రీధర్, షెడ్మాకి ఆనంద్ రావు, ముడుపు దామోదర్ రెడ్డి, రషీద్ ఉల్ హాక్, ఉయిక ఇందిర, మునిగెల నర్సింగ్, నాగర్కర్ శంకర్, కొండూరి రవి, మానే శంకర్, రాజా లింగన్న, సురేష్ ఉన్నారు.

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
కుమురంభీం ఆసిఫాబాద్
సోమవారం | డిసెంబర్ 11, 2023 | www.navatelangana.com

నేటి నుండి పద్మశాలీల సభ్యత్వ నమోదు

నవతెలంగాణ-ఆసిఫాబాద్

పద్మశాలి సంఘం ఆధ్వర్యంలో మండలంలో పద్మశాలీల కుటుంబ వివరాలు, సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని సోమవారం నుంచి నిర్వహించడం జరుగుతుందని జిల్లా అధ్యక్షుడు ఇరుకుల్ల ఆంజనేయులు ఆదివారం ప్రకటనలో పేర్కొన్నారు. సభ్యత్వ నమోదు కార్యక్రమానికి పద్మశాలీలు సహకరించి వివరాలు అందజేయాలని కోరారు. ఈ కార్యక్రమం పూర్తిస్థాయిలో విజయవంతం చేసేందుకు ప్రతి ఒక్కరూ సహకారం అందించాలని విజ్ఞప్తి చేశారు.

ఆరంభ ప్రతిస్థాపన మహోత్సవం

లక్షెట్టిపేట : మండలంలోని సూరారం గ్రామంలో కత్తెరశాల మల్లన్న మల్లికార్జున దేవాలయ ఆరంభ ప్రతిస్థాపన మహోత్సవం కార్యక్రమంలో మంచిర్యాల మాజీ ఎమ్మెల్యే దివాకర్ రావు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, నాయకులు, తదితరులు, పాల్గొన్నారు.

సమ్మక్క సారలమ్మ జాతరకు పకడ్బందీ ఏర్పాట్లు

నవతెలంగాణ-కాగజ్‌నగర్



ఫిబ్రవరి 21 నుండి 24 వరకు నిర్వహించే సమ్మక్క సారలమ్మ జాతరకు పకడ్బందీ ఏర్పాట్లు చేపట్టేందుకు నిర్ణయం తీసుకున్నట్లు జాతర కమిటీ అధ్యక్షులు తుమ్మ రమేష్ తెలిపారు. జాతర ఏర్పాట్ల సందర్భంగా ఆదివారం పెద్దవాగు సమీపంలోని సమ్మక్క సారలమ్మ గద్దెల వద్ద కమిటీ సమావేశం నిర్వహించారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా ఉండేందుకు చర్యలు తీసుకోవాలని ఈ సమావేశంలో తీర్మాణించినట్లు తెలిపారు. ఈ సమావేశంలో కమిటీ కార్యదర్శి పోలోజు శ్రీనివాస్, సభ్యులు సీపీ రాజ్‌కుమార్, మంద రాజయ్య, అవదూత శ్రీనివాస్, పిర్సింగుల శ్రీనివాస్, బి వెంకటేష్, పిర్సింగుల తిరుపతి, డి.వెంకటేష్, రాజేశ్వర్‌రావు, కోట శంకర్ పాల్గొన్నారు.

దొడ్డి కొమురయ్య బయోపిక్ కోసం సంఘాల మద్దతు



నవతెలంగాణ-ఆసిఫాబాద్

తెలంగాణ సాయుధ పోరాటంలో తొలి అమరుడైన దొడ్డి కొమురయ్య బయోపిక్ తీయడానికి దర్శకుడు సేతుపతికి వివిధ సంఘాల నాయకులు మద్దతు తెలిపారు. జిల్లా కేంద్రంలోని బీసీ సంఘ భవనంలో మున్నూరు కాపు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు శంకర్, బీసీ సంఘం రైతు జిల్లా అధ్యక్షుడు వైరగడ మారుతి పటేల్‌తో పాటు వివిధ సంఘాల నాయకులు దర్శకునితో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పోరాటయోధుడు చరిత్ర ప్రతి ఒక్కరికి తెలియాల్సిన అవసరం ఉంటుందని, ఆ దిశగా దర్శకుడు ముందుకు రావడం సంతోషంగా ఉందన్నారు. బయోపిక్‌కు కావలసిన పూర్తి సహకారం అందిస్తామని హామీ ఇచ్చారు. అనంతరం దర్శకునికి సంఘాల నాయకులను పలువురు సన్మానించారు. ఈ కార్యక్రమంలో జిల్లా నాయి బ్రాహ్మణ సంఘం జిల్లా అధ్యక్షుడు కొదురుపాక ఇస్తారి, నాయి బ్రాహ్మణ సంఘ నాయకులు జూలూరి సత్యనారాయణ, జూలూరి శంకర్, బొమ్మకంటి కిరణ్ కుమార్, కొదురుపాక దీపక్, సొన్నాయిల ఉమేందర్, జూలూరి విలాస్ పాల్గొన్నారు.

అయ్యప్ప ఆలయంలో కొనసాగుతున్న పూజలు



నవతెలంగాణ-ఆసిఫాబాద్

జిల్లా కేంద్రంలో పెద్దవాగు ఒడ్డున గల అయ్యప్ప ఆలయంలో పూజలు కొనసాగుతున్నాయి. ఆదివారం కమిటీ అధ్యక్షుడు వేణుగోపాల్, ప్రధాన కార్యదర్శి వెంకట్‌గౌడ్‌ల ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ప్రతిరోజు నిర్వహించే పూజా కార్యక్రమంలో భక్తులు పెద్ద ఎత్తున పాల్గొనాలని కోరారు. అయ్యప్ప స్వాములకు ఆలయంలో నిత్య అన్నదాన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. వివిధ పనుల నిమిత్తం జిల్లా కేంద్రానికి వచ్చే అయ్యప్ప స్వాములు ఆలయానికి వచ్చి బిక్ష స్వీకరించవచ్చని సూచించారు. ఈ కార్యక్రమంలో కోశాధికారి చంద్రమోహన్, సభ్యులు మోహన్, బట్టుపల్లి సంతోష్, సతీష్, చిట్టిమల్ల సంతోష్, బాలరాము, దూడల అశోక్, మడావి శ్రీనివాస్, మహేష్, శ్యాంసుందర్, స్వాములు పాల్గొన్నారు.

ఘనంగా అంతర్జాతీయ మానవ హక్కుల దినోత్సవం

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

అంతర్జాతీయ మానవ హక్కుల దినోత్సవాన్ని ఆదివారం స్వార్క్ నేషన్ నేషనల్ హ్యూమన్ రైట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్అండ్‌బీ విశ్రాంతి భవనం వద్ద అసోసియేషన్ నాయకులు సంబరాలు జరుపుకున్నారు. అనంతరం మీడియాతో అసోసియేషన్ జిల్లా చైర్మెన్ గుర్రం పున్నంరావ్ మాట్లాడుతూ మనిషి బతకలంటే వనరులు కావలని, దానికి హక్కులు ఉతం ఇస్తాయన్నారు. మానవుల కోసం 12 హక్కులతో పాటు పలు చట్టాలున్నాయన్నారు. వాటి గురించి తెలియక మోసపుతున్నట్లు తమ దృష్టికి వచ్చిందన్నారు. గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో మానవ హక్కులు, చట్టాలపై అవగాహన కార్యక్రమాలు చేపడుతామన్నారు. ఈ కార్యక్రమంలో సభ్యులు ఉన్నారు.

రాష్ట్రస్థాయి షూటింగ్ పోటీల్లో ద్వితీయ స్థానం



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

నల్గొండ జిల్లా కేంద్రంలోని సెయింట్ మారి సీబీఎస్సీ హైస్కూల్లో జరిగిన 11వ రాష్ట్రస్థాయి జూనియర్ షూటింగ్ బాల్ ఛాంపియన్‌షిప్ పోటీల్లో ఆదిలాబాద్ జిల్లా బాలికల జట్టు ద్వితీయ స్థానం సాధించినట్టు షూటింగ్ బాల్ సంఘం కార్యదర్శి హరిచరణ్, కోచ్ మేనేజర్లు అజయ్, జ్యోతి తెలిపారు. ఫైనల్ మ్యాచ్‌లో ఆదిలాబాద్ బాలికల జట్టు సూర్యాపేట బాలికల జట్టుపై రెండు పాయింట్ల తేడాతో ఓడిపోయి ద్వితీయ స్థానం సాధించినట్టు వివరించారు. ద్వితీయ స్థానం సాధించడంలో వైష్ణవి, సింధు, రాజారాణిలు కీలకపాత్ర పోషించారన్నారు. వీరిని సాయిని రవికుమార్, జిల్లా క్రీడల అభివృద్ధి వెంకటేశ్వర్లు, జిల్లా గిరిజన క్రీడల అధికారి పార్థసారథి అభినందించారు. ఇదే స్ఫూర్తితో జాతీయ స్థాయిలో సైతం మంచి ప్రతిభను కనబర్చి జిల్లాకు పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు.

మహిళలకు సముచిత స్థానం కల్పించాలి

- ఎమ్మెల్యే పాల్వాయి హరీష్‌బాబు

నవతెలంగాణ-కాగజ్‌నగర్



రాష్ట్ర ప్రభుత్వం మహిళలకు సముచిత స్థానం కల్పించాలని సిర్పూరు ఎమ్మెల్యే పాల్వాయి హరీష్‌బాబు అన్నారు. ఆదివారం కాగజ్‌నగర్ బస్టాండ్‌లో ఆయన జిల్లా కలెక్టర్ హేమంత్ బొర్కాడేతో కలిసి మహాలక్ష్మి పథకాన్ని ప్రారంభించారు. జెండా ఊపి బస్సును ప్రారంభించిన అనంతరం ఆ బస్సులో మహిళలతో కలిసి కలెక్టర్, ఎమ్మెల్యే ప్రయాణించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ ఈ పథకంపై అపోహలున్నా వాటిని పటాపంచలు చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం దీనిని అమలు చేయడం అభినందనీయమని అన్నారు. సమాజంలో సగభాగం ఉన్న మహిళలకు గౌరవం ఇవ్వాల్సిన అవసరముందని అన్నారు. మహాలక్ష్మి పథకంతో పాటు రూ.10 లక్షల రాజీవ్ ఆరోగ్యశ్రీ పథకాన్ని కూడా వీరు ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఆర్టీసీ ఆసిఫాబాద్ డీఎం శ్రీధర్, ఆర్టీఓ కార్యాలయం ఎఓ ప్రమోద్, బీజేపీ జిల్లా అధ్యక్షులు డాక్టర్ కొత్తపల్లి శ్రీనివాస్‌తో పాటు పలువురు అధికారులు, బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

ఆటో డ్రైవర్ల కుటుంబాలను ప్రభుత్వం ఆదుకోవాలి

- ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి బోగె ఉపేందర్



నవతెలంగాణ-రెబ్బెన

కాంగ్రెస్ ప్రభుత్వం మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం ప్రవేశపెట్టడం గొప్ప విషయమని, ప్రభుత్వం ఆటో డ్రైవర్లను మానవత దృక్పథంతో ఆదుకోవాలని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి బోగె ఉపేందర్ అన్నారు. ఆదివారం మండల ఆటో డ్రైవర్ల సంఘం అధ్యక్షుడు బొంగు నరసింగరావు, మాజీ అధ్యక్షుడు గొడిసెల వెంకటేశ్వర్‌గౌడ్ అధ్యక్షతన ఆర్అండ్‌బీ గెస్ట్‌హౌజ్ వద్ద సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి బోగె ఉపేందర్ మాట్లాడుతూ రాష్ట్రంలో రవాణా రంగంలో సుమారు 15 లక్షల మంది ఆటో మీద ఆధారపడి జీవిస్తున్నారన్నారు. ప్రభుత్వం ఆదుకోకపోతే వాహన రంగంపై ఆధారపడిన ఆటో డ్రైవర్ల బ్రతుకులు రోడ్డున పడే ప్రమాదం ఉందని, కావునా ఆటో డ్రైవర్ల కుటుంబాలను ప్రభుత్వం ఆదుకోవాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో సుమారుగా 15 లక్షల మంది ఆటో డ్రైవర్లు ఉన్నారని, వారి కుటుంబాలతో కలిపి 40 లక్షల మంది పరోక్షంగా ఈ రంగంపై ఆధారపడి బ్రతుకుతున్నారని ఆయన తెలిపారు. గత ప్రభుత్వాలు ఉపాధి అవకాశాలు కల్పించకపోవడంతో చాలా మంది డిగ్రీలు ఉన్నత చదువులు చదివి ఉపాధి ఆటో డ్రైవర్లుగా మారి కుటుంబాన్ని పోషించడం కోసం అప్పులు చేసి ఆటోలు కొనుగోలు చేసుకొని కుటుంబాన్ని పోషించుకుంటున్నారన్నారు. అసలే అత్యంత తక్కువ గిరాకీ ఉండడం వల్ల అనేక ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. దీనివల్ల ప్రతినెల ఫైనాన్స్ కట్టలేక ఆర్థిక ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఆటో డ్రైవర్లకు జీవనభృతి క్రింద నెలకు రూ.10 వేలు ప్రభుత్వం అందించాలని కోరారు. లేనిపక్షంలో ఆటో డ్రైవర్ల ఆందోళన బాటపట్టాల్సి వస్తుందని అన్నారు. ఆటో మోటార్ రవాణా కార్మిక సంక్షేమ బోర్డు ఏర్పాటుచేయాలని డిమాండ్ చేశారు. ఆటో కార్మికులు అర్హులైన వారికి డబుల్‌బెడ్‌రూం ఇల్లు కేటాయించాలని ఆయన డిమాండ్ చేశారు. అలాగే ఆటో ఫిట్‌నెస్, ఇన్సూరెన్స్ ఇవన్నీ కూడా ఈ ప్రభుత్వమే ఉచితంగా చేయాలని కోరారు. ఆటో డ్రైవర్లకు అర్హులైన వారికి మూడెకరాల భూమి ఇవ్వాలని, బ్యాంకు రుణాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఆటో బందుస్కీం ప్రవేశపెట్టి ఆటో డ్రైవర్లను ప్రభుత్వమే ఆదుకోవాలని వారు కోరారు. ఆటో డ్రైవర్ల సంఘం మాజీ అధ్యక్షుడు గొడిసెల వెంకటేశ్వర్‌రావు, ఆటో డ్రైవర్లు కృష్ణ, వెంకటేశ్, కళ్యాణ్, కుమ్మరి మల్లేష్, ఉమేష్‌గౌడ్, జగన్, శంకర్, ప్రశాంత్, నందు, విజయ, బాబా, తిరుపతి పాల్గొన్నారు.

అంబరాన్నంటిన పూర్వ విద్యార్థుల సమ్మేళనం

నవతెలంగాణ-ఆసిఫాబాద్



జిల్లా కేంద్రంలోని జడ్పీ ఉన్నత పాఠశాలలో 1963-71 సంవత్సరంలో పదో తరగతి చదివిన విద్యార్థులు 60 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా నిర్వహించిన పూర్వ విద్యార్థుల సమ్మేళనం ఆదివారం జిల్లా కేంద్రంలోని వాసవి గార్డెన్‌లో ఘనంగా నిర్వహించారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు వివిధ రకాల కార్యక్రమాలతో చిన్ననాటి జ్ఞాపకాలను గుర్తు చేసుకుంటూ పలు కార్యక్రమాలు ఆద్యంతం ఉత్తేజం నింపాయి. ఈ సందర్భంగా వ్యాఖ్యాతగా తాటిపల్లి జ్యోతి వ్యవహరించగా, వ్యక్తిత్వ వికాస నిపుణుడు ప్రదీప్ పాల్గొని ఇంపాక్ట్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 70 సంవత్సరాల వయసులో ఎక్కువగా శ్రమించకుండా అవసరమైన మేరకు మాత్రమే పనులు చేయాలన్నారు. కొంత వ్యాయామం చేస్తే ఆరోగ్యం



బాగుంటుందని తెలిపారు. 40 సంవత్సరాల వయసు నుంచి కుటుంబ బాధ్యతలతో సతమతమవుతున్న వారు కొంత ఆధ్యాత్మికత వైపు దృష్టి సారించాలని సూచించారు. పూర్వ విద్యార్థులు మాట్లాడుతూ ఆరు దశాబ్దాల కిందటి తన స్నేహితులను మరొకసారి కలుసుకునే అవకాశం వచ్చినందుకు సంతోషంగా ఉందని అన్నారు. కార్యక్రమం నిర్వహణకు కృషిచేసిన సిర్ప అశోక్, మసాడే సునీల్‌కు పూర్వవిద్యార్థులు కృతజ్ఞతలు తెలిపారు. తమ తరగతికి చెందినవారు కొంతమంది మరణించగా వారికి రెండు నిమిషాలు మౌనం పాటించారు. ఈ కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు టీఆర్ అశోక్, సాయిని మదూకర్, గుండా బాలేష్, కాసం మదూకర్, తాటిపెల్లి రాజేశ్వర్, లక్ష్మీనారాయణగౌడ్, అనంతలక్ష్మి, అన్నపూర్ణ, సరోజిని, వినాయకరావ్, జగన్నాథం పాల్గొన్నారు.

రాజ్యాధికారమే లక్ష్యంగా ముందుకు సాగాలి

- ఆరె సంఘం జిల్లా అధ్యక్షుడు బొట్టుపల్లి జయరాం



నవతెలంగాణ-ఆసిఫాబాద్

అందరూ ఐక్యంగా ఉన్నప్పుడే అభివృద్ధి సాధ్యమవుతుందని రాజ్యాధికారం లక్ష్యంగా ముందుకు సాగాలని ఆరే సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు బొట్టుపెల్లి జయరాం అన్నారు. జిల్లా కేంద్రంలోని ఛత్రపతి శివాజీ భవన్‌లో సంఘ సభ్యులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆరె కులస్తులు అభివృద్ధిలో వెనుకబడి ఉన్నారని అన్నారు. అందరూ ఏకతాటిపై ఉన్నప్పుడు అభివృద్ధి సాధ్యమవుతుందని తెలిపారు. ఇది కావాలంటే తప్పనిసరిగా ఆరే కులస్తులకు రాజ్యాధికారం రావాలని రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో తమ కులం సత్తా చాటేలా ప్రతి ఒక్కరు పనిచేయాలన్నారు. తమ కులానికి చెందిన నాయకులను ఎన్నుకునే విధంగా క్షేత్రస్థాయిలో ప్రతి ఒక్కరిని ప్రేరేపించాలని సూచించారు. దీనికోసం ఇప్పటినుండి ప్రయత్నాలు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో అరే సంక్షేమ సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు కోలే బిక్కాజి, ఆసిఫాబాద్ డివిజన్ అధ్యక్షుడు తిరుపతి, ప్రధాన కార్యదర్శి మారుతి, మండల అధ్యక్షుడు గెడేకర్ సంతోష్ పాల్గొన్నారు.

యువకులకు వాలీబాల్ కిట్ అందజేత



నవతెలంగాణ-చింతలమానేపల్లి

మండలంలోని డబ్బా గ్రామం, దరంపల్లి ఎక్స్ రోడ్ యువకులకు శ్రీ శివరామసాయి యూత్ వెల్ఫేర్ సొసైటి వ్యవస్థాపక అధ్యక్షుడు గుర్లే శ్రీనివాస్ ఆధ్వర్యంలో వాలీబాల్ కిట్టును అందచేశారు. ఈ సందర్భంగా యూత్ అధ్యక్షుడు గుర్లే శ్రీనివాస్ మాట్లాడుతూ, క్రీడలు మానసిక ఉల్లాసాన్ని పెంపొందించడంతోపాటు వ్యక్తుల మధ్య పోటీతత్వం పెంచుతాయని అన్నారు. క్రీడల వల్ల యువత శారీరకంగా దఢంగా తయారవుతారని తెలిపారు. యువతను క్రీడా రంగంలో రాణించే విధంగా గత పదమూడు సంవత్సరాల నుంచి శ్రీ శివరామసాయి యూత్ వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో క్రీడపోటీలు నిర్వహిస్తూ క్రీడాకారులకు క్రీడ సామాగ్రిని అందిస్తూ ప్రోత్సహిస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో యూత్ ప్రధానకార్యదర్శి వెంకటేష్ సలహాదారులు ఎద్దు ప్రకాష్, ఉపాధ్యక్షులు బొర్లే పురుషోత్తం, యూత్ సభ్యులు కావుడే సాయికిరణ్, నరేందర్, వడాయి విలాస్, గున్నాజి పాల్గొన్నారు.

స్మైల్ సొసైటీ ఆధ్వర్యంలో అన్నదానం

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

జిల్లా కేంద్రంలోని రిమ్స్ ఆస్పత్రి ఆవరణలో స్మైల్ సొసైటీ ఆధ్వర్యంలో ఆదివారం అన్నదానం నిర్వహించారు. ఈ సందర్భంగా సొసైటీ అధ్యక్షుడు కేమ శ్రీకాంత్ మాట్లాడుతూ సంవత్సర కాలంగా సొసైటీ ఆధ్వర్యంలో ప్రతి ఆదివారం తమ వంతుగా రోగుల సహాయకులు, పేదలు, నిస్సహాయుల ఆకలి తీరుస్తున్నామని పేర్కొన్నారు. ఇందులో సొసైటీ ప్రతినిధులు భూరె సురేష్, రామకృష్ణ, విశాల్, ఆకాష్, రాహుల్, దయానంద్, దివ్య పాల్గొన్నారు.



కంకాలమ్మ జాతరకు పోటెత్తిన భక్త జనం

- ప్రక్క రాష్ట్రాల నుండి భారీగా భక్తుల రాక
- జనసంద్రంగా మారిన కౌటాల క్షేత్రం



నవతెలంగాణ-కౌటాల

స్వయంభు శ్రీకేతేశ్వర, కంకాలమ్మ అమ్మవారి జాతరకు ఆదివారం భక్తులు పోటెత్తారు. మండలకేంద్రంలోని కంకాలమ్మ గుట్టపై ఆలయ కమిటీ వ్యవస్థాపక అధ్యక్షుడు సుల్వ కనకయ్య ఆధ్వర్యంలో జాతర ఏర్పాట్లు నిర్వహించారు. ప్రతి సంవత్సరం కార్తీకమాసం చివరి ఆదివారం కంకాలమ్మ అమ్మవారి జాతర మహోత్సవం నిర్వహించడం ఆనవాయితీగా వస్తుంది. అందులో భాగంగానే ఆదివారం జాతరకు వేలాదిగా భక్తులు తరళివచ్చారు. మండలకేంద్రం నుంచి మొదలు కంకాలమ్మ గుట్ట మొత్తం జనసంద్రంగా మారింది. గుట్టలోని చెట్టు, పుట్ట అంతా జనసందోహంతో నిండిపోయింది. అమ్మవారికి కోరిన కోరికలు తీరుతాయనే నమ్మకంతో ఈ ఆలయానికి భక్తులు వేలాదిగా తరలివచ్చారు. తెలంగాణ రాష్ట్రంతో పాటు పక్కనే ఉన్న మహారాష్ట్ర, ఛత్తీస్‌ఘడ్, మధ్యప్రదేశ్, తమిళనాడు, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. ఉదయం నుంచి అమ్మవారిని దర్శించుకొనేందుకు భక్తులు బారులుతీరారు. ఆలయ ప్రాంగణంలోని అల్లు బండ వద్ద భక్తులు తమ కోరికలను కోరి బండను లేపారు. మొక్కులు తీరిన వారు అమ్మవారికి ముడుపులు చెల్లించుకున్నారు. జాతరకు వచ్చిన భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా ఆలయ కమిటీ సభ్యులు అన్ని ఏర్పాట్లు చేశారు. భక్తులందరికి అన్నదానం ఏర్పాటుచేశారు. జాతరలో ఏర్పాటుచేసిన దుకాణాల వద్ద వస్తువులు కొనుగోలు చేసేందుకు భక్తులు పోటీపడ్డారు. జాతరలో ఏర్పాటుచేసిన పిల్లల ఆట వస్తువుల వద్ద పిల్లలు సందడి చేశారు.

అమ్మవారిని దర్శించుకున్న ఎమ్మెల్యే

సిర్పూర్ ఎమ్మెల్యే డాక్టర్ పాల్వాయి హరీష్‌బాబు ఆదివారం స్వయంభు కేతేశ్వరం, కంకాలమ్మ అమ్మవారిని దర్శించుకొని మొక్కులు చెల్లించుకున్నారు.





అమ్మవారికి పట్టువస్త్రాలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. ఆలయ కమిటీ అధ్యక్షుడు ఎమ్మెల్యే హరీష్‌బాబును బీజేపీ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ కొత్తపల్లి శ్రీనివాస్‌ను శాలువాలతో సన్మానించారు. ఎమ్మెల్యేతో పాటు మాజీ ఎమ్మెల్యే పాల్వాయి రాజ్యలక్ష్మి అమ్మవారిని దర్శించుకొని మొక్కులు చెల్లించుకున్నారు. వారి వెంట పలువురు బీజేపీ నాయకులు ఉన్నారు. అదేవిదంగా అడిషనల్ ఎస్పీ అచ్చేశ్వర్‌రావు, డీఎస్పీ కరుణాకర్, సీఐలు సాదిక్‌పాషా, బుద్దె స్వామి, సీఐ నాగరాజు, ఎంపీపీ బసార్కర్ విశ్వనాత్, సర్పంచ్ వొజ్జెల మౌనీష్‌తో పాటు పలువురు ప్రజా ప్రతినిధులు, ప్రముఖులు అమ్మవారిని దర్శించుకున్నారు.

భారీ బందోబస్తు

కంకాలమ్మ అమ్మవారి జాతరలో భక్తులకు ఎలాంటి అవాంఛనీయ సంఘటలు జరుగకుండా అడిషనల్ ఎస్పీ అచ్చేశ్వర్‌రావు ఆధ్వర్యంలో భారీ పోలీసు బందోబస్తు ఏర్పాటుచేశారు. ఒక డీఎస్పీ, ముగ్గురు సీఐలు, 10 మంది ఎస్సైలు మధూకర్, రమేష్, విక్రమ్‌తో పాటు వంద మంది పోలీసులతో భారీ బందోబస్తు ఏర్పాటుచేశారు.